బోణీ అదిరింది

అండర్-19 ప్రపంచకప్‌లో భారత్ ఘనవిజయం

44 పరుగులకే విండీస్ ఆలౌట్

కౌలాలంపూర్: ఐసీసీ మహిళల అండర్-19 ప్రపంచకప్‌లో యువ భారత్ అదిరిపోయే బోణీ కొట్టింది. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన టీమ్‌ఇండియా.. తొలి మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై 9 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించి టైటిల్ వేటను ఘనంగా ఆరంభించింది. కౌలాలంపూర్‌లోని బ్యూమస్ ఓవల్ వేదికగా జరిగిన గ్రూప్-ఏ మ్యాచ్‌లో భారత బౌలర్లు దుమ్మురేపడంతో మొదట బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 44 పరుగులకే కుప్పకూలింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' జోషిత (2/5)తో పాటు అయూషి శుక్లా (2/6), పరుణిక సిసోడియా (3/7) వెస్టిండీస్ బ్యాటర్లను క్రీజులో కుదురుకోనీయలేదు. భారత బౌలర్ల ధాటికి ఆ జట్టులో ఐదుగురు ఖాతా కూడా తెరకవపోగా కెనిక (15), అసబి (12) మినహా మిగినవారు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. బౌలర్లతో పాటు ఫీల్డర్లు మైదానంలో పాదరసంలా కదులుతూ మూడు రనౌట్లు చేయడంతో విండీస్ కోలుకోలేకపోయింది. అనంతరం లక్ష్యాన్ని భారత్.. 4.2 ఓవర్లలోనే పూర్తిచేసింది. తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష (4) నిరాశపరిచినా కమలిని (16 నాటౌట్), సనిక (18 నాటౌట్) వేగంగా ఆడారు. గ్రూప్-ఏలో శ్రీలంక, మలేషియా మధ్య జరిగిన మ్యాచ్‌లో లంక అమ్మాయిలు 139 పరుగల భారీ తేడాతో గెలుపొందారు. మొదట బ్యాటింగ్ చేసిన లంక.. 162/6 చేయగా ఆతిథ్య మలేషియా 14.1 ఓవర్లలో 23 పరుగులకే ఆలౌట్ అయింది. ఈనెల 21న జరిగే మ్యాచ్‌లో భారత్, మలేషియా తలపడతాయి.

ఇంటివాడైన నీరజ్ చోప్రా

ఢిల్లీ: భారత గోల్డెన్ బాయ్ నీరజ్ చోప్రా ఓ ఇంటివాడయ్యాడు. ఆదివారం అతడే స్వయంగా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా వేదికగా ఈ విషయాన్ని వెల్లడించి అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తాడు. అత్యంత సన్నిహితుల సమక్షంలో.. సోనిపట్‌కు చెందిన హిమానిని నీరజ్ వివాహమాడాడు. హిమాని ప్రస్తుతం అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్నట్టు సమాచారం. ఆమె టెన్నిస్ క్రీడాకారిణి. 2016లో మలేషియాలో జరిగిన వరల్డ్ జూనియర్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో ఆమె స్వర్ణ పతకం గెలిచింది. 2017 వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లోనూ పాల్గొంది. మూడు రోజుల క్రితమే వీరి పెండ్లి జరిగిందని చెప్పిన నీరజ్ బంధువు.. ప్రస్తుతం కొత్త జంట హనీ మూన్ కోసం అమెరికాలో ఉన్నట్టు తెలిపాడు.

27 నుంచి తెలంగాణ జిల్లాల క్రికెట్ టోర్నీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఈనెల 27 నుంచి తెలంగాణ జిల్లాల అండర్-17 క్రికెట్ టీ20 టోర్నమెంట్ ప్రారంభం కానుంది. ఈ మేరకు తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) వ్యవస్థాపక అధ్యక్షుడు, శాట్ మాజీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర రెడ్డి నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఆయనతో కలిసి ప్రముఖ అంకాలజిస్ట్, భారత సంతతి అమెరికా వైద్యుల సంఘం అధ్యక్షుడు సతీశ్ కత్తుల, ఎన్నారై వైద్యులు నాథ రమణ మూర్తి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సతీశ్ మాట్లాడుతూ.. 'తెలంగాణలో క్రికెట్ అభివృద్ధి చెందాలి. ఈ టోర్నీతో ప్రతిభావంతులైన క్రికెటర్లు వెలుగులోకి రానుండటం అభినందనీయం' అని అన్నారు. అల్లీపురం మాట్లాడుతూ.. 'ఈ టోర్నీలో ఉమ్మడి 9 జిల్లాలు సహా టీడీసీఏ ఎలెవన్ జట్లు పోటీ పడనున్నాయి. ఇక్కడ ప్రతిభ చూపిన క్రికెటర్ల నుంచి మూడు జట్లను ఎంపిక చేసి మార్చి మూడో వారంలో అమెరికా క్రికెట్ అకాడమీ జట్టుతో మ్యాచ్‌లను నిర్వహిస్తాం' అని అన్నారు.

మను భాకర్ ఇంట విషాదం



చర్కీ దాద్రి (హర్యానా): మూడు రోజుల క్రితమే ప్రతిష్టాత్మక 'ఖేల్‌రత్న' అవార్డును అందుకున్న ఆనందంలో ఉన్న షూటర్ మను భాకర్ ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది. ఆదివారం ఉదయం 9 గంటలకు జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో మను అమ్మమ్మ (సావిత్రి దేవి), మేనమామ (యుధ్వీర్) ప్రాణాలు కోల్పోయారు. మహేంద్రగఢ్ బైపాస్ రోడ్డు వద్ద జరిగిన ప్రమాదంలో ఈ ఇద్దరూ ఘటనాస్థలంలోనే దుర్మరణం చెందారు. హర్యానా ఆర్టీసీలో డ్రైవర్‌గా పనిచేస్తున్న యుధ్వీర్.. బైక్‌పై సావిత్రిని తీసుకుని ఉద్యోగానికి వెళ్తుండగా అవతలి వైపున అదుపు తప్పి వచ్చిన కారు వారిని ఢీకొట్టడంతో ఆ ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన నిందితుడు పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు.

పాక్ విజయం

ముల్తాన్: స్పిన్నర్లు వికెట్లు పండుగ చేసుకున్న ముల్తాన్ టెస్టులో ఆతిథ్య పాకిస్థాన్.. వెస్టిండీస్‌ను ఓడించింది. మొదటి టెస్టులో పాక్.. 127 పరుగుల తేడాతో గెలిచి సిరీస్‌లో 1-0 ఆధిక్యం సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో విండీస్ ఎదుట 251 పరుగులను నిర్దేశించిన పాక్.. పర్యాటక జట్టును 123 పరుగులకే పరిమితం చేసింది. సాజిద్ ఖాన్ (5/50), అబ్రర్ అహ్మద్ (4/27) విండీస్ బ్యాటర్లను నిలువనీయలేదు.

పురుషులు, మహిళల విభాగాల్లో జయకేతనం

విశ్వవిజేత భారత్

రెండు టైటిల్స్‌తో సరికొత్త చరిత్ర • ఫైనల్‌లో నేపాల్ జట్ల ఓటమి

ఢిల్లీ: స్వదేశీ క్రీడ ఖోఖో తొలి ప్రపంచకప్‌లో భారత్ చరిత్ర సృష్టించింది. భారత పురుషులు, మహిళల జట్లు మొదటి ఖోఖో ప్రపంచకప్ టైటిల్స్‌ను కైవసం చేసుకున్నాయి. ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఫైనల్‌లో భారత పురుషుల జట్టు.. 54-36 (18 పాయింట్ల తేడా)తో నేపాల్‌ను ఓడించింది. అమ్మాయిలు సైతం 78-40 (38 పాయింట్ల తేడా)తో నేపాల్ మహిళల జట్టును చిత్తు చేసి సత్తా చాటారు.

దేశరాజధాని ఢిల్లీ ఆతిథ్యమిచ్చిన తొలి ఖోఖో ప్రపంచకప్‌లో భారత్ సత్తా చాటింది. స్వదేశంలో ఆదివారం ముగిసిన మొదటి ఎడిషన్‌లో భారత పురుషుల, మహిళల జట్లు టైటిల్స్ గెలిచి సరికొత్త చరిత్ర సృష్టించాయి. అచ్చొచ్చిన స్వదేశీ క్రీడలో టోర్నీ ఆరంభం నుంచే అసలు ఓటమన్నదే ఎరుగకుండా సత్తాచాటిన మన క్రీడాకారులు.. ఫైనల్‌లోనూ అదే ఆటతీరుతో తమకు ఎదురేలేదని నిరూపించారు. ఇరు విభాగాల్లోనూ నేపాల్ ప్రత్యర్థి కాగా రెండింట్లోనూ ఆ జట్టుకు పరాభవం తప్పలేదు. అటాకింగ్‌లో స్కైడైవ్‌లు, చిరుత పులిలాంటి వేగం, పక్కా వ్యూహాలతో ప్రత్యర్థిని పలుమార్లు ఆలౌట్ చేసి పాయింట్లు రాబట్టుకున్న పురుషుల, మహిళల జట్లు.. డిఫెండింగ్‌లో నేపాల్ ఆటగాళ్లకు చిక్కకుండా వారికి కప్‌ను దూరం చేశారు.

అమ్మాయిలు తగ్గేదేలే..

ప్రపంచకప్ ఆరంభ మ్యాచ్‌లోనే రికార్డు స్కోరుతో దక్షిణ కొరియాను చిత్తుచిత్తుగా ఓడించిన భారత మహిళల జట్టు ఫైనల్‌లోనూ అదే జోరు కొనసాగించింది. తొలి టర్న్‌లోనే భారత్.. నేపాల్ డిఫెండర్లపై ఎదురుదాడికి దిగింది. ఫస్ట్ టర్న్‌లో మూడు బ్యాచ్‌ల నేపాల్ ఆటగాళ్లను ఏడుసార్లు ఔట్ చేయడంతో 34 పాయింట్లను ఖాతాలో వేసుకుంది. నేపాల్ సైతం అటాకింగ్‌లో చెలరేగడంతో ఆ జట్టుకు 24 పాయింట్లు దక్కాయి. మూడో టర్న్‌లో భారత్ మరింత దూకుడు పెంచింది. మూడో టర్న్ ముగిసేసరికి ఆధిక్యాన్ని 49కు పెంచుకుంది. నాలుగో టర్న్‌లో నేపాల్ 16 పాయింట్లు మాత్రమే సాధించడంతో భారత్ మ్యాచ్‌తో పాటు టైటిల్‌ను దక్కించుకుంది.

అబ్బాయిలు ఆది నుంచే..

ఈ టోర్నీ తొలి మ్యాచ్‌లోనే నేపాల్‌పై ఉత్కంఠ పోరులో నెగ్గిన భారత్.. ఫైనల్‌లోనూ టాస్ గెలిచి మొదట అటాకింగ్‌ను ఎంచుకుని ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. ఫస్ట్ టర్న్ ఆరంభంలో నేపాల్ డిఫెండర్లు కాస్త ప్రతిఘటించినా తర్వాత పట్టు తప్పారు. దీంతో మొదటి టర్న్ ముగిసేసరికి భారత్ 26 పాయింట్లు సాధించింది. అద్భుతమైన స్కైడైవ్‌లు, ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేసే వేగంతో కదలిన భారత్.. డిఫెండింగ్ లోనూ సత్తా చాటింది. రెండో టర్న్‌లో నేపాల్ 18 పాయింట్లు మాత్రమే సాధించగలిగింది. డిఫెండింగ్‌లో ఆదిత్య గణ్‌పుల్, కెప్టెన్ ప్రతీక్ వారియర్ అద్భుతంగా పోరాడారు. మూడో టర్న్‌లోనూ అదే జోరు కొనసాగించిన మన కుర్రాళ్లు.. అది ముగిసేసరికి 54-18తో తిరుగులేని ఆధిక్యాన్ని సాధించారు. చివరి టర్న్‌లో నేపాల్ మరో 18 పాయింట్లు మాత్రమే రాబట్టడంతో భారత్ 18 పాయింట్ల తేడాతో ప్రపంచకప్‌ను సొంతం చేసుకుంది.

'డబుల్' ఆనందం: హరీష్ రావు

తొలి ఖోఖో ప్రపంచకప్‌లో దేశానికి 'డబుల్' ఆనందం. పురుషుల, మహిళల జట్లు ఓటమన్నదే లేకుండా దేశానికి కీర్తిని తీసుకొచ్చాయి. ప్రపంచ చాంపియన్లకు అభినందనలు. ఆటగాళ్లు, కోచ్‌లకు సెల్యూట్.

జొకో X అల్కరాజ్

క్వార్టర్స్‌లో ఆసక్తికర సమరం

గాఫ్, సబలెంక జోరు • క్వార్టర్స్‌కు బోపన్న జంట

మెల్‌బోర్న్: ఆధునిక టెన్నిస్ దిగ్గజంగా వెలుగొందుతున్న నొవాక్ జొకోవిచ్ (సెర్బియా), భావి సూపర్‌స్టార్‌గా ఎదుగుతోన్న యువ సంచలనం కార్లోస్ అల్కరాజ్ (స్పెయిన్) మరోసారి అమీతుమీకి సిద్ధమయ్యారు. గత రెండేండ్లుగా వింబుల్డన్ ఫైనల్స్, గతేడాది పారిస్ ఒలింపిక్స్‌లో ముఖాముఖి తలపడ్డ జొకో, అల్కరాజ్ హైఓల్టేజ్ సమరానికి ఈసారి ఆస్ట్రేలియా ఓపెన్ వేదికైంది. ఈ ఇద్దరూ ఆస్ట్రేలియా ఓపెన్ పురుషుల సింగిల్స్‌లో ప్రిక్వార్టర్స్‌లో గెలిచి క్వార్టర్స్‌లో తలపడనున్నారు. ఆదివారం జరిగిన ప్రిక్వార్టర్స్ మ్యాచ్‌లో ఏడో సీడ్ జొకో.. 6-3, 6-4, 7-6 (7/4)తో జిరి లెహెకా (చెక్) ను వరుస సెట్లలో చిత్తు చేశాడు. మ్యాచ్‌లో లెహెకా.. 11 ఏస్‌లు, 39 విన్నర్లతో జొకో (9, 27) కంటే ఎక్కువే సాధించినా.. 44 అనవసర తప్పిదాలతో మూల్యం చెల్లించుకున్నాడు. మరో మ్యాచ్‌లో అల్కరాజ్.. 7-5, 6-1తో జాక్ డ్రాపర్ (బ్రిటన్)పై గెలిచాడు. రెండు సెట్ల తర్వాత డ్రాపర్ గాయంతో వెనుదిరగడంతో ఈ స్పెయిన్ కుర్రాడు క్వార్టర్స్‌కు వాకోవర్ సాధించాడు. ఇక మిగిలిన మ్యాచ్‌లలో జ్వెరెవ్ (జర్మనీ) 6-1, 2-6, 6-3, 6-2తో హంబర్ట్ (ఫ్రాన్స్)ను చిత్తు చేయగా టామీ పాల్.. 6-1, 6-1, 6-1తో డేవిడోవిచ్ (స్పెయిన్)పై గెలిచి క్వార్టర్స్‌కు అర్హత సాధించారు.

గాఫ్ జోరు

మహిళల సింగిల్స్‌లో అమెరికా అమ్మాయి కోకో గాఫ్ జోరు కొనసాగుతోంది. ప్రిక్వార్టర్స్‌లో గాఫ్.. 5-7, 6-2, 6-1తో బెలిండా (స్విట్జర్లాండ్)ను ఓడించింది. ఈ సీజన్‌లో ప్రత్యర్థికి తొలిసారిగా ఒక సెట్ కోల్పోయిన గాఫ్.. తిరిగి పుంజుకుని వరుస సెట్లలో గెలిచి క్వార్టర్స్‌కు చేరింది. డిఫెండింగ్ చాంపియన్ సబలెంక 6-1, 6-2తో మిర్రా ఆండ్రీవాపై అలవోక విజయం సాధించింది. భారత వెటరన్ బోపన్న, ఎస్.జెంగ్ (చైనా) జంట ఈ టోర్నీ క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది.

ఎన్‌పీఎస్‌కు దారేది!

ఈపీఎఫ్‌వో ఖాతా నుంచి నిధుల బదిలీకి వీలుందా.. నిపుణులు ఏమంటున్నారు?

ప్రవీణ్ ఓ ప్రైవేట్ ఉద్యోగి. రాబడులను పెంచుకోవడానికి తన ఈపీఎఫ్‌వో ఖాతా నుంచి ఎన్‌పీఎస్‌కు నిధులను బదిలీ చేసుకోవాలనుకుంటున్నాడు. నిజానికి ఇంకా 10 సంవత్సరాల సర్వీస్ ఉన్నది. కానీ ఇది సాధ్యమేనా? అన్న సందేహాలతో సతమతమైపోతున్నాడు. ఒకవేళ సాధ్యమే అయితే అందుకున్న ప్రక్రియ ఏమిటి? పన్నుల భారం ఏమైనా ఉంటుందా? మరి నిపుణులు ఏమంటున్నారు..

ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌వో) ఖాతా నుంచి నేషనల్ పెన్షన్ స్కీం (ఎన్‌పీఎస్)కు ఉద్యోగులు తమ నిధులను బదిలీ చేసుకోవచ్చని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. పైగా ఎన్‌పీఎస్ టైర్ 1 ఖాతాకు ఈపీఎఫ్ నిధి ఏకకాల బదిలీ.. ఎన్‌పీఎస్‌కు విరాళంగా పరిగణించలేరు కాబట్టి ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 10(12) కింద పన్ను మినహాయింపు ప్రయోజనాన్ని కూడా పొందవచ్చు. అయితే ఇందుకు మీకు ఓ క్రియాశీల ఎన్‌పీఎస్ టైర్ 1 ఖాతా అవసరం. దీర్ఘకాల రిటైర్మెంట్ సేవింగ్స్ కోసం రూపొందించబడినదే ఈ ఎన్‌పీఎస్ టైర్ 1 అకౌంట్. ఈ ఖాతాదారులకు చెప్పుకోదగ్గ స్థాయిలో పన్ను ప్రయోజనాలూ ఉంటాయి. దీని వడ్డీకి పన్ను మినహాయింపుంటుంది. సెక్షన్ 10(12ఏ) కింద 60 శాతం పీఎఫ్ నిధికి పన్నులు చెల్లించనక్కర్లేదు. మిగతా 40 శాతాన్ని ఆదాయ పన్నులనుబట్టి యాన్యుటీ ప్లాన్‌లో తిరిగి పెట్టుబడిగా పెట్టుకోవచ్చు. మీరు ఉద్యోగం చేస్తున్న కంపెనీ ద్వారానే ఈ ఖాతాను పొందవచ్చు. అలాకాకపోతే పాయింట్ ఆఫ్ ప్రజెన్స్ (పీవోపీ) లేదా ఈఎన్‌పీఎస్ పోర్టల్ ద్వారా పనిచేసుకోవచ్చు. ఇక ఎన్‌పీఎస్‌కు ఈపీఎఫ్‌వో ఖాతా నుంచి నిధుల బదిలీకి మీరు ప్రస్తుతం పనిచేస్తున్న కంపెనీ ద్వారా రికగ్నైజ్డ్ ఈపీఎఫ్‌కు ఓ బదిలీ విజ్ఞప్తిని సమర్పించాల్సి ఉంటుంది.

గుర్తుంచుకోండి

ఈపీఎఫ్‌వో ఖాతా నుంచి ఎన్‌పీఎస్‌కు నిధులను మళ్లించే ముందు మీరు మీ ఆర్థిక పరిస్థితుల్ని, లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని నిర్ణయం తీసుకుంటే లాభదాయకం. ఈపీఎఫ్‌కు అదనంగా స్టాక్స్, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌ల్లో మీకు పెట్టుబడులున్నట్టైతే ఈపీఎఫ్ నిధులను అలాగే ఉంచుకోవడం ఉత్తమమని చెప్పవచ్చు. ఎందుకంటే మీ పదవీ విరమణ సమయంలో ఈ నిధులు మీకు మరింత దన్నుగా నిలుస్తాయి. అయితే మీ రిటైర్మెంట్ లక్ష్యానికి తగ్గట్టుగా ఈక్విటీ సాధనాలకు కేటాయింపులను పెంచుకోవచ్చు. అందుకు నిధుల కొరత ఉంటే.. ఎన్‌పీఎస్‌కు మారడాన్ని పరిశీలించవచ్చు. ఇక మీ ఈక్విటీ పెట్టుబడులు కేవలం 20 శాతం దరిదాపుల్లోనే ఉంటే 'ఆటో' ఆప్షన్‌ను ఎంచుకోవచ్చు. వయసు పెరుగుతున్నాకొద్ది అవి 10-15 శాతానికి దిగొస్తాయి. ఒకవేళ 'యాక్టీవ్' ఆప్షన్‌ను ఎంచుకొంటే 50 ఏండ్లదాకా 75 శాతం వరకు, 60 ఏండ్లకల్లా 50 శాతానికి తగ్గుతాయి.

దినేశ్ వయసు 40 ఏండ్లు. పెండ్లై, ఇద్దరు పిల్లలున్నారు. ఒకరికి 10 ఏండ్లు, మరొకరికి ఏడాది. తన ఈక్విటీ పోర్ట్‌ఫోలియో విలువ రూ.1.6 కోట్లు (మ్యూచువల్ ఫండ్స్‌లో రూ.50 లక్షలు, స్టాక్స్‌లో రూ.1.1 కోట్లున్నాయి). అంతేగాక ఈపీఎఫ్‌లో మరో రూ.25 లక్షలున్నాయి. ఇక రూ.80 లక్షల టర్మ్ ఇన్సూరెన్స్, తాను ఉద్యోగం చేస్తున్న కంపెనీ ద్వారా రూ.30 లక్షల కుటుంబ ఆరోగ్య బీమాను కలిగి ఉన్నాడు. కాగా, స్మాల్-క్యాప్ ఈటీఎఫ్‌లో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) ద్వారా నెలనెలా రూ.50,000 కడుతున్నాడు. అలాగే నెలవారీ ఖర్చులు రూ.70,000. అయితే 58 ఏండ్లకు రిటైర్ అవ్వాలని చూస్తుండగా.. ఇదే రీతిలో పెట్టుబడులు, ఆదాయం ఉంటే సాధ్యమేనా? అని ఆలోచిస్తున్నాడు. మరి నిపుణులు ఏం చెప్తున్నారు?

6 శాతం ద్రవ్యోల్బణంతో ఇప్పుడున్న మీ నెలవారీ రూ.70,000 ఖర్చు.. మీకు 58 ఏండ్లు వచ్చేసరికి రూ.2 లక్షలకు పెరుగుతుంది. కనుక 58 ఏండ్లు దాటిన తర్వాత ఉండే వ్యయాన్ని అందుకోవాలంటే రూ.9 కోట్ల నిధి అవసరం. ఇక ఇప్పుడున్న ఈపీఎఫ్, మ్యూచువల్ ఫండ్స్, స్టాక్స్ పెట్టుబడులు ఏటా 12 శాతం రాబడుల్ని పంచినా.. అప్పటికల్లా దాదాపు రూ.17 కోట్ల నిధిని ఏర్పర్చగలవు. పిల్లల చదువు ఖర్చుల్ని పరిగణనలోకి తీసుకున్నా.. ప్రస్తుతానికైతే లక్ష్య సాధనలో సరైన మార్గంలోనే వెళ్తున్నారని చెప్పవచ్చు. అయితే సింగిల్ స్మాల్-క్యాప్ ఈటీఎఫ్‌లో పెట్టుబడులు పెడుతున్నారు. కాబట్టి వేర్వేరు మార్కెట్ క్యాప్స్‌లో సిప్‌లకు ప్రయత్నించండి. ఇక ఇప్పటికైతే బీమా కవరేజీ భేష్. కానీ ఉద్యోగం వదిలేసిన తర్వాత ఈ ఆరోగ్య బీమా సరిపోతుందా? అన్నది ఆలోచించండి. చివరగా ఏడాదికోసారైనా మీ పోర్ట్‌ఫోలియో, లక్ష్యాలను సమీక్షించుకోవడం మంచిది.

రాబడి

ఈ క్రెడిట్ కార్డులతో రుణ పరపతి జూమ్

అందరికీ ఇప్పుడు క్రెడిట్ స్కోర్, క్రెడిట్ హిస్టరీలు కీలకమైపోయాయి. పర్సనల్ బ్యాంకింగ్ రంగంలో ప్రస్తుతం ఈ రెండింటి ఆధారంగానే మెజారిటీ లావాదేవీలు జరుగుతున్నాయంటే అర్థం చేసుకోవచ్చు వాటికున్న ప్రాధాన్యం ఏమిటన్నది? అయితే మీరెక్కడా ఇప్పటిదాకా రుణాలు తీసుకోకుంటే మీకు రుణ చరిత్రే (క్రెడిట్ హిస్టరీ) ఉండదు. రుణ ఎగవేతలున్నా క్రెడిట్ స్కోర్ బాగుండదు. అప్పుడు మీ లోన్ అప్లికేషన్లు, మీరు పెట్టుకున్న క్రెడిట్ కార్డ్ విజ్ఞప్తులు తప్పకుండా తిరస్కరణకు గురవుతాయి. మరి అలాంటప్పుడు ఏం చేయాలి?

ఇదీ సంగతి..

క్రెడిట్ స్కోర్, క్రెడిట్ హిస్టరీ బాగాలేని వారి ఆర్థిక అవసరాలకు సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులు ఓ చక్కని పరిష్కార మార్గమని చెప్పవచ్చు. రుణ చరిత్ర, క్రెడిట్ స్కోర్లతో సంబంధం లేకుండా బ్యాంకులు ఈ సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులను జారీ చేస్తాయి.

సెక్యూర్డ్ క్రెడిట్ కార్డు అంటే?

సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులను నగదు పూచీకత్తుపైనే జారీ చేస్తారన్నది గుర్తుంచుకోవాలి. సహజంగా క్రెడిట్ కార్డు బకాయిల చెల్లింపుల్లో ఎగవేతలకు ఆస్కారమున్నప్పుడు బ్యాంకర్లు తమ రక్షణార్థం వీటిని కస్టమర్లకు ఇస్తూంటారు. దీనివల్ల కస్టమర్లు క్రెడిట్ కార్డు బిల్లులను చెల్లించలేకపోయినా బ్యాంకులకు నష్టం వాటిల్లదు. కార్డు కోసం పూచీకత్తుగా పెట్టిన నగదును ఆ బకాయిల కింద జమ చేసుకునే వెసులుబాటు ఉండటమే కారణం. కాబట్టి ఇలాంటి కస్టమర్ల విషయంలో బ్యాంకులు సేఫ్ జోన్‌లో ఉన్నట్టే. ఇక కార్డు పరిమితి రూ.50,000 కావాలనుకుంటే, అంతే మొత్తాన్ని డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. రూ.3 లక్షలు లేదా రూ.5 లక్షలు కావాలన్నా.. అంతే మొత్తాలు డిపాజిట్ చేయాలి. ఒక్కమాటలో చెప్పాలంటే మీరు చేసే డిపాజిట్లనుబట్టే మీరు పొందే క్రెడిట్ కార్డుకున్న రుణ పరిమితులు ఆధారపడి ఉంటాయి.

- విద్యార్థులు, అప్పుడప్పుడే సంపాదన లోపడ్డవారికి ఈ సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులను ఎక్కువగా బ్యాంకింగ్ సంస్థలు సూచిస్తాయి.
- తీవ్ర ఆర్థిక ఇబ్బందులను చవిచూసిన వారు.. క్రెడిట్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నా వారి క్రెడిట్ స్కోర్ తక్కువగా ఉంటుంది గనుక ఇవే వస్తాయి.
- రుణ చరిత్రలేనివారికి ఈ కార్డుతో క్రెడిట్ స్కోర్ ఏర్పడుతుంది. సక్రమ లావాదేవీలతో క్రెడిట్ స్కోర్‌ను క్రమేణా పెంచుకోవచ్చు.
- ఈ సెక్యూర్డ్ క్రెడిట్ కార్డు.. రెగ్యులర్ క్రెడిట్ కార్డు మాదిరే ఉంటుంది. చెల్లింపులు, వడ్డీలు, జరిమానాల్లో ఏ తేడాలు ఉండవు.
- తొలుత తీసుకున్న సెక్యూర్డ్ క్రెడిట్ కార్డును క్రమశిక్షణతో వినియోగిస్తే క్రెడిట్ స్కోర్ పెరుగుతుంది. దాని ఆధారంగా బ్యాంకింగ్ నిబంధనలకు లోబడి అన్‌సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులను పొందవచ్చు.

ఆర్థిక ప్రగతికి ఆరు మెట్లు



ప్రతీ ఒక్కరికీ ఆర్థిక ప్రగతి అనేది అనివార్యం. అది లేకపోతే బతుకు బండి సజావుగా సాగదు మరి. అలాంటి ఆర్థిక ప్రగతికి ప్రధానంగా ఆరు మెట్లుంటాయి. వీటిని అధిరోహిస్తే మన కలల్ని సులభంగా సాకారం చేసుకోవచ్చు. ఆదాయం, ఖర్చులు, పొదుపు, మదుపు, బీమా, ప్రణాళికలే ఆ ఆరు కీలక మెట్లు. ఏ మెట్టు నుంచి అదుపు తప్పినా కిందకు పడిపోవడం ఖాయం.

ఆదాయం సమృద్ధిగా ఉంటే ఎలాంటి లక్ష్యాన్నైనా ఇట్టే చేరుకోవచ్చు. కానీ ఖర్చుల్ని కూడా అదుపులో పెట్టుకోవాలి. పొదుపునకు పెద్ద పీట వేస్తూ ముందుకెళ్లాలి. పెట్టుబడులకు ప్రాధాన్యాన్నిస్తూ నిర్ణయాలు తీసుకోవాలి. బీమా కొండంత ధైర్యం. మనం లేని రోజున మనవాళ్లకి అదే భరోసా. వీటన్నింటినీ ప్రణాళికాబద్ధంగా అమలు చేయగలగాలి.

అమ్మకాల ఒత్తిడిలోనే..

మార్కెట్ పల్స్

దేశీయ స్టాక్ మార్కెట్లను నష్టాలు వీడటం లేదు. ఈ ఏడాది మొదలు సూచీలు ఒడిదొడుకుల్లోనే కదులుతున్నాయి. మెజారిటీ మదుపరులు లాభాల స్వీకరణకే పెద్దపీట వేస్తున్నారు. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 759.58 పాయింట్లు లేదా 0.98 శాతం పడిపోయి 76,619.33 వద్ద ముగిసింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 228.30 పాయింట్లు లేదా 0.97 శాతం కోల్పోయి 23,203.20 దగ్గర నిలిచింది. అంతకుముందు వారంలోనైతే ఈ నష్టాలు ఇంకా ఎక్కువగానే నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ వారం కూడా ట్రేడింగ్‌లో ఒడిదొడుకులకు ఆస్కారముందని, ముఖ్యంగా అమ్మకాల ఒత్తిడిలోనే ఇన్వెస్టర్లుంటారని మెజారిటీ నిపుణులు అంచనా వేస్తున్నారు. కానీ ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) మూడో త్రైమాసికానికి (అక్టోబర్-డిసెంబర్) గాను ఆయా సంస్థలు ప్రకటించే ఆర్థిక ఫలితాల ప్రభావం కూడా ట్రేడింగ్ సరళిని నిర్దేశించవచ్చన్న అభిప్రాయాలూ వినిపిస్తున్నాయి. ఇక డాలర్‌తో పోల్చితే దారుణంగా దిగజారుతున్న రూపాయి మారకం విలువ.. మార్కెట్ నష్టాలను పెంచుతున్నది. మరోవైపు గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ మదుపరుల పెట్టుబడులు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలూ ముఖ్యమేనని చెప్పవచ్చు. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 22,900 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,700 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 23,500-23,700 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

గమనిక..

*స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడ